అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

• ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

ఎన్పీకుంట: కుల మతాలకు అతీతంగా పేదరికమే ప్రామాణికంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన మండల పరిధిలోని పెడబల్లి పంచాయతీలోని పెడబల్లి, అంబేడ్కర్ కాలనీ, గొల్లపల్లి, నాగంవారిపల్లి, ఎన్.జీ.పీ తండా, యల్లంపల్లి గ్రామాలలో పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీస్తూ, అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. సీసీ రోడ్లు కావాలని, సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని గొల్లపల్లి, పెడబల్లి, నాగంవారిపల్లి వాసులు కోరారు. ఆయా సమస్యలపై స్పందించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం పెడబల్లి గ్రామంలో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ప్రతి నిరుపేదకూ సొంతింటి కలను సాకారం చేసేందుకు సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారన్నారు. తర్వాత పెడబల్లి గ్రామంలోని ఈద్గా మైదానంలో పెడబల్లికి చెందిన పారిశ్రామికవేత్త ముసల్‌రెడ్డి గారి హరీష్‌రెడ్డి సుమారు రూ.1.80 లక్షలతో ఏర్పాటు చేయించిన ఉజూఖానా, కొళాయిలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎంపీపీ ఈటెరాము, వైస్ ఎంపీపీ కేశవరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సరస్వతి, తిమ్మారెడ్డి, కొత్తరంగారెడ్డి, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు శీలంవెంకటరామిరెడ్డి, ఉపసర్పంచ్‌లు రామకృష్ణ, సామిరెడ్డి, జేసీఎస్ అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్ బయారెడ్డి, డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ రాఘవయ్య, నాయకులు నారాయణస్వామి, ముసల్‌రెడ్డిగారి విశ్వనాథరెడ్డి, ఎం.నాగిరెడ్డి, కలాం బాషా, సిద్దారెడ్డి, రమేష్‌రెడ్డి, పుల్లారెడ్డి, ఎంపీడీఓ ఆదినారాయణ, ఈఓఆర్డీ మనోహర్ పాల్గొన్నారు.

పేదల కష్టాలు తీర్చేది జగనన్నే

• ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

ప్రశాంతి నిలయం: పేదల కష్టాలు తీర్చి వారి కుటుంబాలకు భరోసా కల్పించడమే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో మంగళవారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్గొని ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలు అందని గడప ఒక్కటి కూడా లేదన్నారు. రాబోవు ఎన్నికల్లో మరోమారు జగనన్నకు అందరూ అండగా ఉండాలని కోరారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా జాతీయ రహదారులు నిర్మించామన్నారు. 193 చెరువులను కృష్ణాజలాలతో నింపే గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. అభివృద్ధి కొనసాగేందుకు వైఎస్సార్‌సీపీని మరోమారు అధికారంలోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మున్సిపల్ చైర్మన్ ఓబులపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, కౌన్సిలర్లు చెరువు భాస్కర్‌రెడ్డి, పవన్‌కుమార్, నాయకులు పార్థసారథిరెడ్డి, లింగాల భాస్కర్‌రెడ్డి, రాజారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, నారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, బాలకృష్ణానాయక్, దేవేంద్రనాయక్, రామస్వామి నాయక్, విజయ్, రమేష్‌నాయక్, రాజేష్ పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

చంద్రబాబు బూటకపు హామీలు నమ్మొద్దు

• ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: అధికారం కోసం ప్రజల్ని మోసం చేయడం, బూటకపు హామీలు ఇవ్వడం చంద్రబాబుకు పరిపాటి అని, ఈ సారి చంద్రబాబుకు రిటైర్మెంట్ ఇచ్చి ఇంట్లో కూర్చో బెట్టడం ఖాయమని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ధర్మవరంలోని 37వ వార్డులో మంగళవారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. అనంతరం ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. సచివాలయాన్ని తనిఖీ చేసి పథకాల అమలు తీరును పరిశీలించారు.పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందించాలని సిబ్బందిని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేసి విశ్వసనీయతను చాటుకున్నారన్నారు. నేతన్న నేస్తం పథకం ద్వారా యేడాదికి రూ.24వేలు చొప్పున అందించి చేనేతలను ఆదుకున్నారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా బుట్ట దాఖలు చేసి మరోసారి మోసం చేసేందుకు సిద్ధమవుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్రగుంట భాగ్యలక్ష్మి, వైస్ చైర్మన్ పెణుజూరు నాగరాజు, పట్టణ సచివాలయ కన్వీనర్, వార్డు కౌన్సిలర్ చందమూరి నారాయణరెడ్డి, జింకా కంబగిరి, బ్రహ్మాజీ, మద్దిలేటి మల్లికార్జున, చెన్నా ప్రసాద్, తాతయ్య, రామలింగ, మోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, కాటా శ్రీన, ఓబిలేషు, బాలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ కరుణాకర్

పుట్టపర్తి: బుక్కపట్నం తహసీల్దార్‌గా కరుణాకర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నూతన తహసీల్దార్ పేర్కొన్నారు.

బత్తలపల్లి: మండలం నుంచి బదిలీపై వెళ్లిన పలు కార్యాలయాల సిబ్బంది స్థానంలో కొత్త వారు నియమితులయ్యారు. ఎంపీడీఓ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్‌గా లక్ష్మీకళ, మాల్యవంతం పంచాయతీ కార్యదర్శిగా గంగరత్నమ్మ బాధ్యతలు స్వీకరించారు.

అతిసారంపై అవగాహన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

ముదిగుబ్బ: మండల పరిధిలోని మలకవేమల పీహెచ్‌సీ పరిధిలోని తప్పెటవారిపల్లి గ్రామంలో మంగళవారం డాక్టర్ నాగేంద్రనాయక్ ఆధ్వర్యంలో అతిసార నివారణ పక్షోత్సవాలను ర్వహించారు. ఈ సందర్భంగా పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించి అతిసార తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సీహెచ్ఓ శైలజ పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల పరిశీలన

నల్లచెరువు: కే.పూలకుంట గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీఓ శకుంతల మంగళవారం తనిఖీ చేశారు. ప్రతి కూలీకి రోజువారి వేతనం రూ.257 గిట్టుబాటు అయ్యేలా పనులు కల్పించాలని ఫీల్డ్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం కే.పూలకుంటలోని సచివాలయాన్ని తనిఖీ చేశారు.

ఏఎస్‌ఐకు సన్మానం



ఏఎస్‌ఐ రమణారెడ్డిని సన్మానించిన దృశ్యం

గాండ్లపెంట: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఐదేళ్లుగా పనిచేసి బదిలీపై వెళుతున్న ఏఎస్‌ఐ ఎన్. రమణారెడ్డిని కదిరి రూరల్ సీఐ శివశంకర్‌నాయక్, ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి మంగళవారం ఘనంగా సన్మానించారు.

ఆర్టీసీ డీఎంకు ఆధార్ నంబర్లు అందజేయండి

కదిరి అర్బన్: ఆర్టీసీలో మెడికల్ కారణాలతో పదవీ విరమణ పొందిన ఉద్యోగులు ఆధార్ నంబర్, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్ నంబర్ల వివరాలు ఈనెల 9 లోపు ఆర్టీసీ డిపోలో అందజేయాలని డీఎం మైనోద్దీన్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

యువకుడి హఠాన్మరణం

బత్తలపల్లి: స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన అక్కిం ఓబిలేసు(34) అనే యువకుడు ఆకస్మికంగా మృతి చెందాడు. ఈయన బత్తలపల్లి కూడలిలో జామకాయలు అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం రాత్రి ఆరోగ్యం బాగాలేదని ఆర్డీటీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ కాశీం తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, కుమారుడు, కుమార్తె ఉన్నారన్నారు.

దిగువచెర్లోపల్లి పంచాయతీలో టీడీపీకి షాక్

• 45 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి కండువా వేసి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండలం దిగువచెర్లోపల్లి పంచాయతీలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. గ్రామానికి చెందిన 40 ఏళ్లుగా టీడీపీలో కొనసాగిన 45 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సమక్షంలో జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీనరసమ్మ, వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ గంగాద్రి ఆధ్వర్యంలో మంగళవారం టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారు మాట్లాడుతూ టీడీపీ విజయానికి నాలుగు శతాబ్దాలుగా కృషి చేసినా గుర్తింపు లేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న జనరంజకమైన పాలనకు ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో ఊరాతి వెంకటస్వామి, ఈశ్వరమ్మ, వెంకటరమణ, అక్కమ్మ, గంగులప్ప, మనేరి ఆదినారాయణ, నారాయణమ్మ, నరసింహప్ప, ఓబుళమ్మ, రామక్రిష్ణ, నరసింహప్ప, గంగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సాకేలక్ష్మమ్మ, మంగమ్మ, నామాల అంజనేయులు, బి.శ్రీనివాసులు, సాకే రామాంజులు, పూల చిరంజీవి, సాతార్లపల్లి గ్రామానికి చెందిన కడపల రామచంద్రారెడ్డి, బడాశివారెడ్డి, పుట్ల చంద్ర, బీడుపల్లి గంగులప్ప, సాకే వినోద్, కంసల రాందాసు, సాకే వేమన్న, లక్ష్మమ్మ, వెంకటేష్, వెంకటలక్ష్మి, గంగాద్రి, సుమలత, రామచంద్ర, ఉత్తాచారి, ధారాచంద్ర, గంగాదేవి ఉన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రంగన్న, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు తిరుపాల్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ ఈశ్వరరెడ్డి, కన్యాకుమారి, బాలు, మురళీధర్‌రెడ్డి, శేషాద్రిరెడ్డి, క్రిష్టారెడ్డి, తదితరులు ఉన్నారు.

రహదారుల అభివృద్ధికి సర్కారు పెద్దపీట




గొల్లపల్లికి నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

ఎన్పీకుంట: రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. మండల పరిధిలోని నాగంవారిపల్లి, గొల్లపల్లి, ఎన్‌జీపీ తండా గ్రామాలకు రూ.2.19కోట్లతో నూతనంగా నిర్మించిన సీసీ, బీటీ రోడ్లకు మంగళవారం ఆయన పూజలు చేసి ప్రారంభించారు. టీడీపీ హయాంలో పల్లె ప్రాంతాలు రోడ్లు లేక 108, 104 వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి ఉండేదని అన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక పల్లె రహదారులకు మహర్దశ పట్టిందన్నారు. సీఎం వైఎస్ జగనన్న చొరవతో ప్రతి గ్రామానికీ సీసీ, బీటీ రోడ్లు వేశామని తెలిపారు. ఇదిలా ఉండగా పెడబల్లి నుంచి నల్లగుట్టపల్లి తండా మధ్య పాపాఘ్ని నదిపై నిర్మించిన వంతెన ఎత్తు పెంచాలని తండా వాసులు కోరారు. నదికి వరద వచ్చినప్పుడు రాకపోకలకు ఇబ్బందిగా ఉందన్నారు. ఎంపీపీ ఈటెరాము, వైస్‌ఎంపీపీ కేశవరెడ్డి, పారిశ్రామికవేత్త హరీష్‌రెడ్డి, నాగిరెడ్డి, గోవింద నాయక్, ఆటో కృష్ణ, పుల్లారెడ్డి, తిరుమలనాయుడు, భాస్కర్‌రెడ్డి, గంగిరెడ్డి, ప్రభాకర్, పురుషోత్తంరెడ్డి, జయరామిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

బత్తలపల్లి: వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ అధికారి డాక్టర్ కుళ్లాయప్ప నాయక్ వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగే ఆశాడే కార్యక్రమంలో పాల్గొన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమీక్షించారు. ఈనెల 5వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటెన్సిఫైడ్ డయేరియా కంట్రోల్ ఫోర్ట్ నైట్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. డయేరియా(అతిసారం) బారిన పడే ఐదేళ్లలోపు బిడ్డల మరణాలను తగ్గించే క్రమంలో ఓఆర్ఎస్, జింక్‌ల ప్రాధాన్యతను ప్రజలకు వివరించాలన్నారు. వైద్యాధికారి గంగిరెడ్డి, సీహెచ్ఓ రాజశేఖర్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీల ఎంపిక



నరసింహులు | భువనేశ్వర్‌రెడ్డి | జ్యోతి కేశవ | కవితారెడ్డి | చెన్నక్రిష్ణ | సాధిక్ | నారాయణ స్వామి నాయక్

పుట్టపర్తి అర్బన్: వైఎస్సార్‌సీపీ పుట్టపర్తి మున్సిపాలిటీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, రైతు, యువత, మహిళా సంఘాల అనుబంధ కమిటీలను ఏర్పాటు చేశారు. ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా సాయినగర్‌కు చెందిన పైపల్లి నరసింహులు, ఉపాధ్యక్షులుగా ఎనుములపల్లి ఆంజనేయులు, ఎనుములపల్లి గంగాదిని ఎంపిక చేశారు. ఎస్టీ విభాగం అధ్యక్షుడిగా బ్రాహ్మణపల్లి తండా నారాయణస్వామి నాయక్, ఉపాధ్యక్షులుగా బడేనాయక్ తండా సోమ్లానాయక్, బ్రాహ్మణపల్లి తండా రామస్వామి నాయక్‌ను ఎంపిక చేశారు. మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా గణేష్ సర్కిల్ సాధిక్, ఉపాధ్యక్షులుగా జెండా వేపమాను ఖాదర్, చిత్రావతి రోడ్డు మహమ్మద్ అలీ, బీసీ విభాగం అధ్యక్షుడిగా చిత్రావతి రోడ్డు జ్యోతి కేశవ, ఉపాధ్యక్షులుగా గుట్ట సుబ్రహ్మణ్యం, పెద్ద బజార్ మూర్తిని ఎంపిక చేశారు. రైతు విభాగం అధ్యక్షుడిగా రాయలవారిపల్లి చెన్నకృష్ణ, ఉపాధ్యక్షులుగా బీడుపల్లి రంగప్ప, ఎనుములపల్లి కృష్టారెడ్డి, యూత్ విభాగం అధ్యక్షుడిగా వివేకానంద రోడ్డు భువనేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షులుగా పెద్ద కమ్మవారిపల్లి సత్యనారాయణ, గణేష్ సర్కిల్ నరేష్ యాదవ్‌ను ఎంపిక చేశారు. మహిళా విభాగం అధ్యక్షురాలిగా గోకులం కవితారెడ్డి, ఉపాధ్యక్షులుగా గుట్ట భారతి, చిత్రావతి రోడ్డు కోగిర సువర్ణను ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి డీఎస్ కేశవరెడ్డి తెలిపారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



రైతులకు వేరుశనగ కాయలు పంపిణీ చేస్తున్న ఆవుటాల రమణారెడ్డి

పుట్టపర్తి టౌన్: రైతుల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి మున్సిపాలిటీలోని 17వ వార్డు బీడుపల్లి గ్రామంలో ఆర్బీకేలో మంగళవారం ఆయన రాయితీ వేరుశనగను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 416 రైతు భరోసా కేంద్రాల్లో 20 వేల క్వింటాళ్ల వేరుశనగ కాయలు సిద్ధంగా ఉన్నాయన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీఆర్‌సీ ఏడీఏ సనావుల్లా, ఏఓలు సురేంద్ర, వెంకటబ్రహ్మం, వీఏఓ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

గజ్జలప్పగారిపల్లిలో నేడు గడప గడపకూ...

తలుపుల: లక్కసముద్రం పంచాయతీ గజ్జలప్పగారిపల్లి గ్రామంలో బుధవారం ఉదయం 7 గంటలకు ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టనున్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అధికారులు పాల్గొనాలని సర్పంచ్ తులశమ్మ, ఎంపీపీ రఫినాయక్, వెంకట్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి సూచించారు.

కమిషనర్‌గా బండిశేషన్న



ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ బండిశేషన్న

ధర్మవరం: ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా నియమితులైన బండి శేషన్న మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. నూతన కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ అందరి సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలందిస్తామన్నారు. ప్రధానంగా పారిశుద్ధ్యం, నీటి సరఫరాపై దృష్టి పెడతామన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ఓడీ చెరువు: మండలంలోని గౌనిపల్లిలో మంగళవారం గౌనివారిపల్లి ఏపీజీబీ మేనేజర్ రాణాప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధానమంత్రి జీవన్ సురక్ష, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా, మొబైల్ బ్యాంకింగ్, ఆర్‌టీజీఎస్ నిత్య సౌకర్యం గురించి వివరించారు. అసిస్టెంట్ మేనేజర్ ఫారుక్, ఫీల్డ్ ఆఫీసర్ హైమావతి పాల్గొన్నారు.

ఘనంగా అంకాలమ్మ విగ్రహ ప్రతిష్ట





అంకాలమ్మ విగ్రహం, తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తున్న కోటి సూర్యప్రకాష్‌బాబు, కోటి సుధ

బత్తలపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో మంగళవారం అంకాలమ్మ తల్లి విగ్రహాన్ని ప్రతిష్టించారు. వేదపండితులు మంజునాథశర్మ ఆధ్వర్యంలో అంకాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట, యంత్ర స్థాపన, పూర్ణాహుతి కార్యక్రమాలను పూజారి నరసింహులు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు. అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు కోటి సుధ, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

పేదలకు సాగుకు యోగ్యమైన భూమి

• ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



రైతులకు సాగు పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: నియోజకవర్గంలోని రైతు కూలీలకు, పేదలకు త్వరలో జరిగే భూ పంపిణీ ద్వారా సాగుకు యోగ్యమైన భూమి అందజేస్తామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ముదిగుబ్బ మండలం పొడ్రాళ్లపల్లి, రామస్వామి నాయక్ తాండలలో చాలా ఏళ్లుగా శోత్రియం భూములు సాగు చేసుకుంటున్న వారికి డీపట్టాలను, పాసు పుస్తకాలను ఎమ్మెల్యే కేతిరెడ్డి మంగళవారం తన నివాసంలో పంపిణీ చేశారు. మొత్తం 14మంది రైతులకు 32.6 ఎకరాల పట్టాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శోత్రియం భూములు సాగు చేసుకుంటున్నా వారి సమస్యలను గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా తెలుసుకొని జాయింట్ కలెక్టర్‌తో మాట్లాడి రైతులకు పట్టాలు మంజూరు చేయించినట్లు తెలిపారు. 2009 నుంచి 2014 సంవత్సరంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు భూ పంపిణీ ద్వారా పేదలకు 40వేల ఎకరాలు పంపిణీ చేశానని గుర్తు చేశారు. త్వరలో జరగబోయే భూ పంపిణీ ద్వారా మరో 5వేల ఎకరాలను పేదలకు అందజేస్తున్నట్లు తెలిపారు.

జగనన్నకు రుణపడి ఉంటాం



ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డిని సన్మానిస్తున్న పారా మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగులు

కదిరి టౌన్: కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరిస్తున్నట్లు సీఎం వైఎస్ జగన్ ప్రకటించడంతో 2002 డీఎస్సీ పారా మెడికల్ కాంట్రాక్ట్ ఉద్యోగుల్లో ఆనందోత్సవాలు మిన్నంటుతున్నాయి. మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కాంట్రాక్టు ఉద్యోగులు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగనన్నకు తామంతా రుణపడి ఉంటామన్నారు.

పంట రుణాల రెన్యూవల్ పూర్తి చేయండి

తనకల్లు: పంట రుణాల రెన్యూవల్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని వివిధ పార్టీల నాయకులు విజ్ఞప్తి చేశారు. స్థానిక చౌడేశ్వరీ దేవి ఆలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. కొక్కంటి క్రాస్‌లోని యూనియన్ బ్యాంక్‌లో పంట రుణాల రెన్యూవల్ సక్రమంగా జరగడం లేదన్నారు. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, రైతు సంఘాల నాయకులు తోపు పారేసు, రెడ్డెప్ప, శివన్న, వెంకటరమణ, నరసింహులు, చిన్నప్ప పాల్గొన్నారు.

నివాళులర్పించిన ఎమ్మెల్యే

ఎన్పీకుంట: మండల కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్ కాలనీకి చెందిన పెండ్లూరి చిన్నప్ప (65) గుండెపోటుతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి వెళ్లి చిన్నప్ప మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.10వేల ఆర్థిక సాయం అందించారు.

మొక్కలు నాటిన విద్యార్థులు



కొత్తచెరువు: సమ్మర్ క్యాంప్‌లో భాగంగా కొత్తచెరువులోని గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులు మొక్కలు నాటారు. గ్రంథాలయ అధికారి జయరాం పర్యావరణ ప్రాముఖ్యతను, మొక్కలను సంరక్షించుకోవాల్సిన ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు.

వ్యక్తి ఆత్మహత్య



సానే గోవిందు రెడ్డి (ఫైల్)

నల్లచెరువు: ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన సానే గోవిందురెడ్డి(40) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈయన తనకున్న పొలంలో పంటలు సాగు చేస్తున్నాడు. బయటి వ్యక్తుల వద్ద రూ.4లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక మంగళవారం తన ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య నీరజ, కుమారుడు హర్షవర్ధన్ రెడ్డి ఉన్నారని ఎస్‌ఐ వరలక్ష్మి తెలిపారు.

ఆర్యవైశ్య సంఘం మండల కన్వీనర్‌గా హరీష్ బాబు

కదిరి టౌన్: ఆర్యవైశ్య సంఘం కదిరి మండల కన్వీనర్‌గా నాగేళ్ల హరీష్ బాబును ఎంపిక చేశారు. అనంతపురం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కలవల రామ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో హరీష్ బాబును ఎంపిక చేశారు.

జూదరుల అరెస్ట్

తనకల్లు: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం పేకాట ఆడుతున్న ఏడుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రాంభూపాల్ తెలిపారు. నిందితుల నుంచి రూ.9,540 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.